# స్ప్రేయర్

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, వీధిలోకి చూస్తూ కూర్చున్నాను. చాలా బోర్‌గా వుంది. ఏ పనీ లేకుండా గడపడమంటే నాకుచిరాకు. ఐనా తప్పడంలేదు, శీతాకాలం మూలాన అప్పుడే చీకటిముసురుకుంటోంది టైమ్ చూశాను నాలుగున్నర.

పోస్టుమేన్ నాకో లెటరిచ్చి వెళ్ళిపోయాడు. ఉత్తరం పట్టుకుని లోపలికి వెళ్ళాను. లైటు వేసి కవరు చింపాను. నన్ను చూడాలని వుందనీ, వీలు చూసుకొని రమ్మనీ స్నేహితుడు మాధవరావు రాశాడు

ఉత్తరం చూపిన తర్వాత నాక్కూడా కొంచెం వుత్సాహం వచ్చింది. కొన్ని రోజులు అక్కడ కాలక్షేపం చేద్దామనుకున్నాను. అనుకున్నదే తడవుగా బేగ్‌లో బట్టలు సర్దుకున్నాను. డ్రస్ వేసుకుని మా ఆవిడతో డొంకరాయి వెళ్తున్నానని చెప్పాను. ఆవిడ ఆశ్చర్యంగా చూడలేదు.

"మీకేం తోస్తే అలా చెయ్యడమే కదా, మళ్ళీ ఎన్నాళ్ళకి తమ దర్శనం! త్వరగా వచ్చేదురూ" అంది.

ఆలాగేనని చెప్పి బస్ స్టాండుకి బయలుదేరాను. కాకినాడ చేరుకునేటప్పటికి రాత్రి ఎనిమిదయ్యింది. ఆ రాత్రి లాడ్జిలో

గడిపాను. పొద్దుటే లాడ్జి నుంచి బయలుదేరి డొంకరాయి ( లోయర్ సీలేరు ) వెళ్ళే బస్సు ఎక్కాను.

నేనిదివరకు ఎప్పుడూ వెళ్ళలేదు. ఎలా వుంటుందో వూహించుకుంటున్నాను. బస్సు అన్నవరం దాటింది. మాధవరావు ఓ రెండేళ్ళుగా డొంకరాయిలో ఎలక్ట్రిసిటీ బోర్డులో పన్జేస్తున్నాడు. నన్ను రమ్మని యిదివరలో చాలాసార్లు రాసాడు. కానీ పనులవత్తిడి వల్ల కుదరలేదు.

చుట్టూ కొండలూ, చెట్లూ కన్పిస్తున్నాయి. బస్సు ఘాటీమీద పరుగెడుతూంది. పక్కకి చూస్తే గుండె ఝల్లుమనేలా లోయ. కొండమీది రోడ్డు లోయవంక గర్వంగా గొప్పగా చూస్తూ వున్నట్టనిపించింది. బహుశా ఈ వ్యవస్థ నాకా ఆలోచన యిచ్చిందేమో, లేకపోతే లోయని నా దగ్గరికి రమ్మంటూ రోడ్డు చేతులు చాస్తున్నట్టు ఎందుకనిపించకూడదూ?

చింతపల్లి దగ్గర బస్సుఆగింది. "భోజనాలు చేసేవాళ్ళు చెయ్యొచ్చు" అన్నాడు కండక్టరు. ఓ తాలూకు పాకదగ్గర తోటి ప్రయాణీకులతోపాటు నడిచాను. భోజనం చేసి బయటకు వచ్చాను. బస్సులో కూర్చుని సిగరెట్ వెలిగించాను. బస్సు కదిలింది. ఒకరి భుజంమీద ఒకరు తల వేలాడేసి కొంతమంది నిద్రపోతున్నారు. బస్సు ఆగింది. రోడ్డు పక్కన చిన్నరాయి వుంది కొందరు ప్రయాణీకులు ఆ "రాతి" కి కొబ్బరికాయలుకొట్టి నమస్కారంచేసి బస్సెక్కారు. వాళ్ళ వంక చూశాను. వాళ్ళప్పుడు చీకటి నవ్వినట్టుగా కనిపించారు. కాఫీ తోటలు పచ్చగా కన్పిస్తున్నాయి వాటి పచ్చదనంతో కళ్ళలో వెలుగు నింపుకున్నాను.

డొంకరాయి చేరుకునేటప్పటికి సాయంత్రం ఐదుగంటలయ్యింది. చలి వణికించేస్తోంది. ఆకాశంలో మేఘాలు కదులుతున్నాయి. లారీలు కంకర మోసుకుంటూ తెగ తిరుగుతున్నాయి. ఓ కిళ్ళీబడ్డీ, చిన్న

హోటలూ కన్పించాయి. కిళ్ళీబడ్డీ దగ్గర మాధవరావు యిల్లు ఎక్కడో తెలుసుకున్నాను. అతను ఓ కుర్రోడి నిచ్చి పంపాడు. అక్కడక్కడా రేకు షెడ్లు తప్పించి అన్నీ పూరిగుడిసెలే. ఓ గుడిసె చూపించి కుర్రోడు వెళ్ళిపోయాడు.

మాధవరావు నన్నుచూసి ఆశ్చర్యపోయాడు. నేను వస్తానని తను అసలు అనుకోలేదుట. 'ఎందుకని' అడిగాను.

"ఈ అరణ్యానికి ఎవరొస్తారు చెప్పరమ్మన్నా" అన్నాడు.

"ఇంట్లో ఎవరూ కన్పించడం లేదేం?"

"మావాళ్ళు పుట్టింటికి దయచేశారు"

దడదడా వర్షం కురవసాగింది.

"శీతాకాలంలో ఈ వర్షాలేవిటి?"

"యిక్కడంతే".

కాలేజి కబుర్లు చెప్పుకుంటూ రాత్రి చాలా భాగం గడిపాం. తన విషయాలు చెప్పాడు ఇక్కడ అద్దెకు యిళ్ళు లేవనీ, ఖాళీస్థలాల్లో ఓ పాక వేసుకుంటున్నాననీ చెప్పాడు తను ఎలక్ట్రిసిటీ బోర్డులో పనిచేస్తుంతడంవల్ల కరెంటు గొడవ లేదన్నాడు.

మర్నాడు ఉదయం మాధవరావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. నేను పుస్తకాలు చదువుతూ చాలాసేపు గడిపాను. పుస్తకాలు ఐపోయాయి, టైమ్ గడవటంలేదు. బట్టలేసుకుని బయల్దేరాను ఆలోచిస్తూ నడుస్తున్నాను. లారీలరొద, ఆడామగా పనిచేస్తూ కనిపించారు. రాళ్ళుమోస్తూ ఆడాళ్ళు, రాళ్లు కొడుతూ మగాళ్ళు. సీలేరు ప్రోజెక్టు రేపు చూడాలి. ఏదో చిన్న వూరులాగ వుంది. ఆలోచనల్లో ఎంతవరకు నడిచానో తెలీలేదు. చిన్న చిన్న గుడిసెలు అక్కడొకటీ అక్కడొకటీ వున్నాయి. చల్లగాలి శరీరాన్ని వణికిస్తోంది.

చిన్నచిన్న మళ్ళలో మిరపతోట పచ్చగా కదులుతోంది. ఓ వ్యక్తి మిరపకాయ నంజుకుంటూ అన్నం తింటూ కనిపించాడు. నేనటు వెళ్ళాను

"ఏ వూర్నొంచి వస్తున్నావు దొరా" అన్నాడతను.

నేను చెప్పి అతని పేరడిగాను.

"వరాలు" అని చెప్పాడు.

మిరప తోటని పరిశీలనగా చూశాను. ఆకు ముడత తెగులు బాగా పట్టింది దానికి మందు కొట్టకపోతే నాలుగోవంతు పంట కూడా రాదు.

"వరాలూ, మిరప తోటకి తెగులు బాగా పట్టింది. మందు కొడితే. ఇంకా ఏపుగా పెరిగి, కాసిన కాయలన్నీ నిలుస్తాయి."

"పోనిద్దూ, ఎంత ప్రాప్తం ఉంటే అంతే పండుద్ది."

"పంట తెగుళ్ళకి మందులు రాకముందు అంతెననుకో. ఇప్పుడలా వూరుకుంటే ఎలాగ"

"ఆ మందులు కొట్టడం మాకు తెలీదు గందా"

"మీ దగ్గర స్ప్రేయర్ వుందా? ఎలాకొట్టాలో చెబుతాను"

"వుండేది కానండి. యిప్పుడు నేదండి"

"ఏవయ్యింది"

"అమ్మేసానండి"

"ఎంతకి"

"తొంభై రూపాయలకండి"

"బాగా పాతదా"

"కాదండి కొత్తదేనండి"

"కొత్తది అంత తక్కువ ఖరీదు కెలా అమ్మేవు? నువ్వు ఎంతకు కొన్నావ్"

"పదిహేను రూపాయలు కాడికే సొసైటి వాళ్లు ఇచ్చారండి. మావాళ్ళంతా డెభై యికి, ఎనభై కి అమ్మేస్తే, నేను మాత్రం మంచి కరీదుకే అమ్మేనండి." అన్నాడు వరాలు నేను తలపట్టుకున్నాను.

మళ్ళీ రేపు వస్తాననిచెప్పి యింటికి బయలుదేరాను. నెమ్మదిగా నడుస్తున్నాను. చల్లగాలి వేగంగా వీస్తోంది రోడ్డు కటూ ఇటూ కొండలు. చీకటి పడుతోంది. ఆకాశంలో మేఘాలు ముసురుకోవటం లేదు. అయినా వర్షం కురవదన్న గ్యారంటీ లేదనుకున్నాను. నడక వేగాన్ని పెంచాను. నేను డొంకరాయి చేరుకునేటప్పటికి బాగా పొద్దుపోయింది.

"ఎక్కడికి వెళ్ళావురా" అన్నాడుమాధవ్ ఆత్రుతగా నన్ను చూడగానే. అంతా చెప్పాను.

"ఐతే కాలేజీ విడిచిపెట్టినా జనాన్ని ఉద్ధరించాలనే జబ్బు నీకింకా తగ్గలేదన్నమాట" అన్నాడు నవ్వుతూ.

నేను మాట్లాడలేదు. మాధవరావు అన్నది జబ్బే అయితే, ఆ జబ్బు మనం బాగుపడే వరకూ వుండాల్సిందే.

భోజనం చేసి పడుకున్నాను. ఎంతసేపటికీ నిద్రపట్టడంలేదు. నా కళ్ళ ముందు వరాలే కదులుతున్నాడు. వరాలు ఆలోచన్లో నే నుండగానే రాత్రి నెమ్మదిగా కరిగిపోయింది.

ఆఫీసులో పని ఉందని మాధవరావు పొద్దుట ఎనిమిది గంటల కే వెళ్ళిపోయాడు. తర్వాత నేను ఓ రెండు గంటలు నడిచి వరాలు దగ్గరకు వెళ్ళాను ఆతను మిరపచేను దగ్గర కన్పించలేదు. చుట్టూ చూశాను.

కొంచెం దూరంలో పూరిగుడిసె దగ్గర హడావుడి కనిపించింది. అక్కడ కెళ్ళాను వరాలు కనిపించాడు అతని కూడా యిద్దరు పురోహితులూ కన్పించారు. వాళ్ళిద్దరి భుజాల్ని మూటలున్నాయి. వరాలు నన్ను చూసి సంతోషంగా పలకరించాడు. బ్రాహ్మలిద్దరూ వరాలుతో 'వస్తామని' చెప్పి వెళ్ళిపోయారు.

"వరాలూ, హడావుడిగా వున్నట్టున్నావేవిటి సంగతి" అన్నాను

"ఇయేల మా అయ్య తద్దినం యెట్టానండి" అన్నాడు.

నిన్న నేను వచ్చేసే ముందు మిరపతోటకి మందు కొట్టడానికి డబ్బు లేదని వరాలు చెప్పిన సంగతి గుర్తుకొచ్చింది. అడుగుదామనుకున్నాను. ఒక్కసారే అడిగితే యెలా? నా మీద అతనికి కోపం రావచ్చు ననుకొని మానేశాను. ఈ పురోహితులకి చెప్పి వొప్పించలేం. వీళ్ళు 'అందు గలడిందు లేడని, అన్నిచోట్లా ఉన్నారు సోమరితనానికి అలవాటు పడ్డవాళ్ళు జనాన్ని మోసగించో' అడుక్కునో బతుకుతారు కానీ' కష్టించి పనేయడానికి యిష్టపడరు. జనం మార్పులోంచే వీళ్ళలో మార్పురావాలి. నా ఆలోచనల్ని ఆపుజేసి, వరాలుతో రేపు మిరప తోటకి మందు కొడదామని చెప్పి, డొంకరాయికి బయల్దేరాను

ఆలోచిస్తూ నడుస్తున్నాను నడుస్తూ ఆలోచిస్తు, ఆలోచిస్తూ నడుస్తూ నేనో నిర్ణయానికి వచ్చాను. వరాలు మిరప తోటకి పట్టిన తెగులుకి మందు ఎలా స్ప్రే చెయ్యాలో అతనికీ, మిగతా వాళ్ళకి నేర్పడం కష్టం ఏమీకాదు. కానీ వాళ్ళ మెదళ్ళకు పట్టిన అజ్ఞానపు తెగులుకి జ్ఞానం మందు స్ప్రే చెయ్యడం కొంచెం కష్టమే. అయినా వాళ్ళ బతుకులు బాగుపడతాయన్న నమ్మకం నాకుంది "సామాను సర్ది ప్రయాణానికి రడీగా వుండమని" మా ఆవిడకి యీ వేళే ఉత్తరం రాయాలి. నా ఉత్తరం చూసి మా ఆవిడ ఆశ్చర్యపోదు! నా తత్వం ఆమెకు పూర్తిగా తెలుసును కదా!.